## ఉపసంఘం ఏర్పాటు పట్ల

# టీఎన్జీఓస్ హర్షం

ఖమ్మం టౌన్, కెరటం న్యూస్

జిఒ 317 ద్వారా అమలు జరిపిన ఉద్యోగుల విభజనలో ఏర్పడిన సమస్యలను అధ్యయనం చేసి పరిష్కారాలను సిఫారసు చేయటం కోసం జిఒ 292 ద్వారా వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి వర్యులు దామోదర రాజనర్సింహ అధ్యక్షతన, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ లను సభ్యులుగా మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయటాన్ని టీ ఎన్ జీ ఓ యూనియన్ స్వాగతిస్తున్నది. రాష్ట్రపతి ఉత్తర్వులు 2018 అమలులో భాగంగా ఉద్యోగుల శాశ్వత కెటాయింపు కోసం గత ప్రభుత్వం 2021 డిసెంబర్ 6 న జిఒ 317 ద్వారా ఏకపక్షంగా విడుదల చేసిన మార్గదర్శకాల కారణంగా పలువురు ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోయారు. క్యాడర్ లో జూనియర్ అయినందుకే స్వంత జిల్లాలను వదిలి పరాయి జిల్లాకు కెటాయించబడ్డారు. భార్యా భర్తలను వేర్వేరు జిల్లాలకు కేటాయించారు. పూర్వపు సర్వీసును వదులుకుని అంతర్జిల్లా బదిలీ ద్వారా వచ్చిన భార్యా భర్తలు కూడా తిరిగి వేరు చేయబడ్డారు. నిబంధనల ప్రకారం భార్యాభర్తలను ఒకే జిల్లాకు బదిలీ చేయాల్సి ఉండగా 19 జిల్లాల్లో అనుమతించి 13 జిల్లాలను బ్లాక్ చేశారు. స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు, విడిపోయిన భార్యాభర్తలకు న్యాయం చేయాలని కోరుతూ గత రెండు సంవత్సరాలుగా టీఎన్జీఓ, టీజీఓ ,యుటిఎఫ్,పీ ఆర్ టీ యూ మొదలగు ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తిని గత ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. పోరాటాలను నిరంకుశంగా అణచివేసింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి గారికి, కాంగ్రెస్ మానిఫెస్టో కమిటీ చైర్మన్ శ్రీధరబాబుకి ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల పక్షాన సమస్యను కూలంకషంగా వివరించడం
జరిగింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే జిఒ 317 ద్వారా ఉత్పన్నమైన సమస్యలను పరిష్కారం చేస్తామని



మానిఫెస్టోలో
పేర్కొన్నారు. ఆ మేరకు
ఈరోజు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయటం ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. జిఒ 317 అమలు కారణంగా ఉత్పన్నమైన సమస్యలను మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం చేసి ఉద్యోగుల సమస్యల అవగాహనా చేసుకొని సత్వరమే సానుకూల పరిష్కారాలను ప్రభుత్వానికి సిఫారసు చేస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తు ఈ క్రమంలో ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో కూడా ఒక సమావేశం ఏర్పాటు చేయటం ద్వారా కింద స్థాయి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సరైన సలహాలు సూచనలు కమిటీకి తెలియ చేయుటకు అవకాశం కలుగుతుందని ఆశా భావం వ్యక్తం చేసినారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి టీ ఎన్ జీ ఓ యూనియన్ రాష్ట్ర మరియు ఖమ్మం జిల్లా పక్షాన కృతజ్ఞతలు తెలియజేశారు.